కథానిక

* అందని లోతులు *

శ్రీ యస్. ఆర్. నంది

1

ఒకొక్కటే మెట్లుదిగి రోడ్డుమీద పాదం పెట్టేసరికి, శరీరంలో రక్తమంతా పాదరసంలా పరుగులు తీసింది నరనరాల్లోను. లిప్తపాటు లోకంలో వెలుగంతా గప్పున మాయమై చిక్కటి నల్లని చీకటి తెరలు తెరలుగా పొంగి, క్రమేపీ వివర్ణమై యెదుటి ప్రపంచం నీడల్లా కళ్లల్లో ఆనేసరికి, జగన్నాథం సిగ్గుపడి చప్పున కదలిపోయాడు ముందుకి.

ఎదుటపడే ప్రతీవాహనం, నడచిపోయే ప్రతీ మనిషీ శకుంతలలాగే అగుపించారు; జట్కాల టకటక, కార్లమోత, రిక్షాల గంటలచప్పుడు ఆ అమ్మాయి మాటల్లా వినిపించేవి!. ఆ పాదమస్తకం కంపించిపోతూ, చెమటలు కక్కుకుంటూ కొంత దూరంపోయి ఉద్వేగాన్ని అణచుకొని, వేగాన్ని తగ్గించాడు.

కాలేజీనించి వస్తున్న అమ్మాయిలు అగుపించారు చేతుల్లో పుస్తకాలతో: నిన్న మొన్నటి వరకు శకుంతల గూడా అలానే పుస్తకాలు పట్టుకొని వెడుతూ వుండేది.

ఏడెనిమిదేళ్ల క్రితం శకుంతల తనతో మాటాడుతున్నపుడు తనలో ఎలాంటి మార్పూ కలగకండా, ఈవాళ మొదటి చూపులో, మొదటి మాటలో, మొదటి నవ్వులో తన కింత వింత పులకరింత కలగడం ఏమిటి!

అప్పుడు ప్రసాదరావు అంటూ వుండేవాడు: మా చెల్లెలు యూనివర్సిటీలో చదువుతోందని. కాని అప్పుడు తనా మాటని అంత లెఖ్ఖలోకి తీసుకోలేదు; అలాంటి నిర్లక్ష్యానికి ఈవాళ జగన్నాథం చాలా నొచ్చుకున్నాడు.

రోడ్డుమీద తన కాయాన్ని ఈ పారవశ్యం మోసుకపోతున్నట్టు జ్ఞాపకం లేదు. అప్రయత్నంగా ఓ మలుపుదగ్గర ఆగిపోయాడు. శరీరం వేపు చూసుకున్నాడు. అదోలా బాధతో సిగ్గుపడ్డాడు. మాసిన గడ్డం, మాసికల గుడ్డలు, అరిగిన చెప్పులు — ఈ అవతారంతోనే ప్రసాదరావు యింటికి వెళ్లాడు.

నిజానికి ఆ రూపవతి ఆవాళ మెయిల్లో వచ్చినట్టు తెలీదు. ఆఫీసునించి విడుదలై దొర్లుకొంటూ వచ్చేస్తూ వుంటే వాకిట్లో ప్రసాదరావుని చూసి పలకరించి పోదామని అడుగులచుక్కాని పక్కకి తిప్పి ఇటు వచ్చాడు. ఎదురుగా ఆడనవ్వు; నమస్కారం చేస్తూ అగుపించింది. క్షణంపాటు గుర్తుపట్టలేక తేరి పార చూశాడు తను ఆ శిల్పాన్ని. ఆచూపు, అబ్బ, తలచుకొంటే ఎంత వికారం అనిపించింది! ప్రతి నమస్కారంగూడా చెయ్యలేదు. మర్యాద తెలియని అడివిమనిషి అనుకొంటుంది. ఆ సోఫాలోనైనా సరిగ్గా కూచోలేకపోయాడు; స్ప్రింగిస్తున్న సోఫాగూడా తన అనాగరికతను అర్థంచేసుకొని నవ్వుకొనివుంటుంది! ఇచ్చినటీని మర్యాదకోసం తాగనన్నాడు. టీ తాగకపోవడం మర్యాదా? ఇంట్లో టీ లేకపోతే నిప్పులు తొక్కిన కోతి అవుతాడుకదా—

“అలవాటులేదా—అదృష్టవంతులు” అంది శకుంతల నవ్వుతూ, తళతళలాడే పళ్లు సగానికి కనిపించేటట్టు.

టీ తాగడం చేతకానివాడా తను? ఇంకా నయం, ఏంచేస్తున్నారని అడిగింది కాదు. ఒకవేళ అడిగితే ఏమిటి చెప్పాలి? బి. ఏ., పోయింది. పూర్తి చెయ్యడానికి పేదరికం కంచెలు తిరిగిన వస్తాదులా ఎదురుగా నిలబడింది. జడిసి, నోరుమూసుకొని గుమస్తా ఉద్యోగాన్ని కావలించుకోవాలిసొచ్చింది-అనేనా? సిగ్గు కాదు. ఛఛ!—ఆనర్స్ పాసైవచ్చిన మగువదగ్గర.

బి. ఏ., ఆనర్స్! ఆడవాళ్లుగూడా పాసై పోతున్న పరీక్ష తను పాసవలేకపోవడం తలుచుకొని లజ్జ చెందాడు. అసలు ఆ యింట్లో వాతావరణమే వేరు. చక్కని సంప్రదాయం, అందుకు తగిన వాతావరణం ఇంకా యింకా ఎన్నో వున్నాయి ప్రతిభావంతమైన వ్యక్తిత్వాన్ని రూపొందించటానికి. ప్రసాదరావు డాక్టరు, వాళ్ళ నాన్నగారు పేరు మోసిన న్యాయవాది. వాళ్ళ నాన్నగారు సంస్కృతాంధ్ర భాషాకోవిదులు, మాతామహులు, ప్రపితామహులు అంతా ఆ కోవకి చెందినవాళ్ళే. ఇప్పటికీ ఆ యింట్లో ఆనువాయితీప్రకారం సదా రాజకీయ, సాంఘిక, సాహిత్య చర్చలు జరుగుతూవుంటై.

అదో ఆదర్శకుటుంబం, ఉత్తమ సభ్యతగలవంశం, పైపెచ్చు ఆగర్భ శ్రీమంతులు.

మరి తను? శీర్షాసనం వేసి వీటిని చూస్తే ఎలా వుంటాయో దృశ్యాలు, అలానే వుంటాయి తన పరిస్థితులు, తను పెరిగి తిరిగిన పరిసరాలు. వాళ్ళ వంశంలో ఎందరు గొప్ప విద్వాంసులున్నారో, తన వంశంలో అందరు మూర్ఖాగ్రేసరులున్నారు; తనింట్లో జరిగేవి రాజకీయ చర్చలు, సాంఘిక చర్చలు, సాహిత్యచర్చలు కావు—ఇరుగు పొరుగు ప్రజల పోకడలగురించి సర్వదా జరిగే పిచ్చాపాటి కాకమ్మ కబుర్లు; వాళ్లెంత ధనవంతులో తను అంత...

ధనానికి ఉత్తమసంస్కృతికీ సంబంధమేమిటో పిచ్చిగాని!

తను ఆశించేదీ అదే: తన ఆశయాలకీ, ఆదర్శాలకీ ఓ స్వరూపం కలిగించి తన యింట్లో ఉత్తమసంస్కృతిని సృష్టించి, స్థాపించాలనుకొంటాడు. ఇంట్లో వంటకి అంకితమైపోయిన తల్లికి, పోకిరీ కుర్రాళ్లతో తిరిగే తమ్ముళ్లకీ ప్రపంచంగురించి చెప్పి వాళ్ళని మేధావులుగా తయారుచేయాలని ఉబలాటపడుతుంటాడు. కాని—

ప్రసాదరావులా తను ధనవంతుడు కాడు; వాళ్ళవంశంలా తన వంశంలో విద్యావంతులు, మేధావులు లేరు యింతకుముందు యిప్పుడూగూడా; వాళ్లలాంటి పెద్ద భవంతి లేదు; అద్దెకొంప, కార్లషెడ్డు!

ఎంత అంతరం తనకీ వాళ్ళకీ!

2

ఇంటికి వచ్చేసరికి యింట్లో వాతావరణం మహా చిరాకుని, కోపాన్ని కలిగించింది.

ఎక్కడుండవలసిన వస్తువులు అక్కడుండవు. దండెంమీద వుండవలసిన గుడ్డముక్కలు కింద పొర్లుతూవుంటై; మాసిన చీరలు తోరణాల్లా తలుపు రెక్కలమీద వేలాడుతూవుంటై; ఎప్పుడో—మధ్యాహ్నం తిన్న ఎంగిలిగిన్నెలులాగుంది—అలా నేవుంటై ఎండిపోయి.

వీటన్నిటికీ తోడు ఈవాళ తమ్ముడు కాళ్లు నేలకేసి కొట్టుకుంటూ ఆమూల వెక్కివెక్కి యేడుస్తున్నాడు. వాడి వాలకం చూసి మరిక ఆవేశం ఆగిందికాదు జగన్నాథరావుకి—చప్పునవెళ్ళి కారణమన్నా అడక్కుండా రెక్కపటుకొని యెతి నాలుగు తగల్నిచ్చాడు. వాటిని తినేసి కాళ్ళకి బుద్ధి చెప్పాడు వాడు.

అదే సమయంలో తల్లివంటింట్లోనించి రంగం మీదికి వచ్చేసరికి అగ్గిమీద గుగ్గిలం పడ్డట్టయింది.

"ఏమిటీ యిల్లంతా? పందులపాకలన్నా యింత ఛండాలంగా వుండవ్—ఛీ ఛీ!"

ఏదో చెప్పబోతున్న తల్లి అలానే నోరావులించి వుండిపోయింది.

"వాడలా యిల్లెగర గొట్టేస్తోంటె చూసేందుకైనా నీకు తీరికలేదు!" కోపం మారి చిరాకులో పడింది.

"బాగుందిరా, నేనుమాత్రం చూసుకోవటం లేదూ? ఇలా శుభ్రం చేసివస్తే అలా యిల్లు నానా పాడూ చేసేస్తుంటే నన్నేం చెయ్యమంటావ్?" అందావిడ.

"ఏం చేస్తావ్!...ఆ ఎంగిలిగిన్నెలు గూడా వాళ్ళే వుంచేశారు కదూ?"

ఆవిడకేం చెప్పడానికి తోచలేదు. చప్పున గిన్నెలెత్తి లోపలికి వెళ్ళిపోయింది.

తలపట్టుకొని "ఛీ ఛీ" అనుకొంటూ అలానే కూలబడ్డాడు—ఇక్ష్వాకుల కాలంనాటి డొక్కు కుర్చీలో.

మళ్ళీ తల్లి సంచి పట్టుకొని లోపలికి రావడంతో ఈ లోకంలో పడ్డాడు.

"ఇంట్లో బియ్యం నిండుకున్నాయి", అంది, తలెత్తి జగన్నాథం చూసేసరికి.

అయితే వెళ్ళాలి బజారుకి...చిరాకుతో సంచి తీసుకొని బయలుదేరాడు.

దార్లో తారసిల్లే రకరకాల వైరుధ్యాలు: సిల్కులు, చింకి బొంతలు; నవ్వులు, ఏడ్పులు; రిక్షాలు, కార్లు—వీటి మధ్యా, వీళ్ళల్లోను తనూ ఓ మనిషి. వీళ్ళందరిలో తను గొప్పవాడు; తనకో ప్రత్యేకస్థానముంది; తన వ్యక్తిత్వం అత్యుత్తమమైనది...ఎందుకో?!

ఆగిపోయాడు రోడ్డు మధ్య చప్పున సమాధానం చెప్పకోలేక.

నవ్వొచ్చింది! లోలో నవ్వుకొన్నాడు. నడక ప్రారంభించాడు. ఇందరు మనుషుల్లో తనే గొప్పవాడన్న భావం యెందుకు కలిగిందో విచిత్రం!...

తనని యింతకుముందు ఎవరైనా పొగిడారా?...... వెంటనే జ్ఞాపకం రాలేదు...

ఒకటొకటిగా మరుపుముడతల కిందనించి మరచిన జ్ఞాపకాలన్నిటినీ దులిపి మనసులో చూసుకొన్నాడు.

ప్రసా...ఆఁ....శకుంతల!...నవ్వు—తియ్యనిది; కంఠం—కోయిలది; అందం—అప్సరసది; వాక్కు—మృదువైనది; ఉన్నత భావాలు—

భావావేశం నడకలో ప్రతిఫలించింది. హోటలు రేడియోలోనుంచి వినిపిస్తున్న సినిమా పాట మరింత త్వరితపరచింది.

వడిహెచ్చిన నడకకు తనే సిగ్గుపడ్డాడు. తనని దిక్కుమాలిన మనుషులు చూస్తే గీస్తే ఏమనుకొంటారు? ఆ అనుకునే వాళ్లెవరో తనని లక్ష కళ్ళతో చూస్తూ నవ్వుతున్నట్టు బిడియపడ్డాడు. నడకలో తొట్రుపాటు వచ్చింది ఫలితంగా.

శకుంతల జ్ఞాపకం, బియ్యాన్ని బేరమన్నా ఆడనివ్వకుండా కొలిపించేసింది.

తను యిలా బజార్లో బేరాలాడుతున్నట్టు శకుంతల చూస్తే ఏమనుకొంటుంది? 'పొట్టకోసం ఎలా మామూలు మనిషిలా బేరాలాడుతున్నాడో! చవకపారు రకం అనుకోదు? ఎంత సిగ్గు!...ఒళ్లంతా జలదరించింది. నిటారుగా లేచి చూసుకున్నాడు పరీక్షగా కుడి ఎడమలకి. చిమ్మచీకట్లు వ్యాపించాయి.

బియ్యంతో యింటికొచ్చాడు.

గదులన్నిటినీ పొగ గాఢంగా కౌగిలించుకొని నవ్వుతోంది. రోజూ కనిపించే దృశ్యమే—అయినా ఈవాళ ప్రత్యేకమైన కోపం వచ్చింది—ఆ పొగ మీదా, తల్లిమీదా!

"అబ్బబ్బ! మనుషులు వుండా లంటారా, చావా లంటారా ఈ వెధవ పొగలో."

వంటింట్లోనించి తల్లి బయటకు వచ్చింది:

"పచ్చిమోదులు, నా తలకాయ, రాజు తేనా? ఎప్పటినించి చస్తున్నాను."

"ఆ చావడంబదులు బొగ్గుపొయ్యి పెట్టరాదూ" అంటూ అరిచాడు, నెలకి డెబ్భయ్‌రూపాయలు సంపాదించే గుమాస్తా.

ఇలా, ఈ సమయంలో, అకస్మాత్తుగా శకుంతల ఈ యింటికి వచ్చేస్తే ఈ పొగని, ఈ గుడ్డముక్కల్ని, కుక్కి మంచాలని, ఈ పిల్లల్ని, ఈ పాడుకొంపనీ చూసి—'ఛీ ఛీ, అసహ్యం, ఏహ్యం' అని డోక్కుంటూ తిరిగిపోదూ? శరీరం కంపించింది సిగ్గుతో.

3

రోజులు గడుస్తున్నకొద్దీ జగన్నాథం ప్రసాదరావు కుటుంబంతో మరీ సన్నిహితుడవుతున్నాడు. వాళ్ళహోదాకి సరితూగుతూ కనిపించడానికి ప్రయత్నించేవాడు. ఒకనాడు పదిరూపాయలు ఖర్చుచేసి పిక్చరు చూపించాడు వాళ్లకి. అది తనకి తృప్తి కలిగిస్తుందనుకున్నాడు—కాని యింట్లో రెండు మూడు రోజులు తిండిఖర్చు తగ్గించుకోవలసి వచ్చేసరికి ఆ ఉల్లాసం యింట్లోవాళ్లమీద కోపంగా మారింది.

శకుంతల ఓసారి అంది: జగన్నాథంగారింటికి వెళ్ళాలి అని.

రావడం, పోవడం స్నేహధర్మమే అయినా జగన్నాథం గుండెల్లో ఫిరంగులు పేల్చినట్టయింది. తమ స్నేహంలో అంతస్థుల భేదాలున్నాయని తెలుసు. దానిని సమర్థించుకోడానికి 'మానవత్వానికి యివన్నీ యెందు'కనే సుభాషితాలు మాటాడేవాడు. శకుంతల తన యింటికి వస్తానని అన్నపుడు ఆ సుభాషితం నిజానికి తను ఆచరణలో పెట్టాలి—కాని ఆమె తనింటికి వస్తే ఆ యిల్లుని చూసి అసహ్యించుకోవచ్చునని భయపడ్డాడు, బిడియపడ్డాడు: తన పేదరికం ఆవిడకు తెలీకూడదు.

మనిషి ఆశలకు ఒక్కొక్కప్పుడు ఔచిత్యానౌచిత్యాలుగూడా అగుపించవు. తను ఏ శకుంతలని తన యింటికి తీసుకరావడానికి సిగ్గుపడ్డాడో ఆ శకుంతలనే ఆయింటి కోడలుగా స్వీకరిస్తే యెంత బావుంటుంది అని ఉవ్విళ్లూరాడు. కాని అది యెంత అడియాసో వెంటనే తెలిసిపోయింది. ఆమెతో తనకున్న పరిచయాన్ని, స్నేహాన్ని ఆధారంగా తీసుకొని ఒకనాడు తనలోని అభిప్రాయాన్ని వెల్లడిచేశాడు:

"నిన్ను ప్రేమిస్తున్నాను శకుంతలా" అని—వెంటనే శరీరంలో రక్తమంతా మెదడులో కేంద్రీకరించినట్టు ఈ మాటలమీద మరింత ఉద్వేగాన్ని, ఉద్రేకాన్ని స్ఫురింపచేసింది.

శకుంతల నిర్ఘాంతపోవడం చూసి, మెదడులో రక్తమంతా పాదాల్లోకి పరుగులుతీసింది. గుండె మెషిన్‌గన్ మాదిరి కొట్టుకోసాగింది.

"క్షమించు జగన్. నీకిలాంటి అభిప్రాయం వుందని నేనెప్పుడూ అనుకోలేదు" అంది తల వంచుకొని.

నిలువునా చచ్చినంత పనయింది. బయటకు వచ్చేశాడు ముఖం దాచుకొని.

ఇంత పెద్ద 'షాక్' తగిలిన తర్వాత తన ముఖాన్ని ప్రసాదరావుకి గాని, శకుంతలకు గాని చూపించడం యెలా? ప్రసాదరావుకి తెలిస్తే యేమనుకొంటాడు? రేపటినించి శకుంతల యెలా చూస్తుంది?

తన ఆశలో తప్పులేకపోవచ్చు. శకుంతల తన యింటికివస్తే తనింట్లో పెద్ద సాంస్కృతిక విప్లవం వచ్చి తన యిల్లు బాగుపడుతుందనే కాంక్ష - కాని శకుంతల గగనకుసుమమని తెలిసిరాలేదు, పాపం, ఆ క్షణంలో.

ఇంటికి వచ్చేసరికి తను వూహించలేని విషయం సిద్ధంగా వుంది. తల్లి నవ్వుతూ ఆహ్వానించింది; కుర్చీలో కూచున్న పెద్దమనిషీ నవ్వుతూ ఆహ్వానించారు; ఇంట్లో చాపలమీద కూచుని మాటాడుకుంటున్న ఆడవాళ్లు చప్పున ముఖాలెత్తి చూశారు. ఈ వాతావరణంలో మాసినగుడ్డలు, తమ్ముళ్ల యేడుపులు, ఎంగిలిగిన్నెలు, పొగ—ఏవీ కనిపించలేదు. —అన్నీ ఆనందంతో, ఉల్లాసంతో, సంతోషంతో "రావయ్యా కొత్తపెళ్ళికొడకా" అన్నట్టు ఆహ్వానిస్తూవున్నాయ్. జగన్నాథం శరీరం జలదరించింది.

అమ్మాయి అందంగా వుంటుంది; సంగీతం వచ్చు; గౌరవం మర్యాదా వున్న కుటుంబమే వాళ్ళది; చురుకైన పిల్లట; ఇంటర్మీడియట్ వరకు 'ఏదో' చదువుకొందని కాబోయే మామగారు దీర్ఘం తీస్తూ చెప్పారు.

జగన్నాథం నోటికి తాళం పడ్డది; కట్నాలు గిట్నాలు లాంటివేం లేకండానే పెళ్లి నిశ్చయమయింది.

ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న సుగుణతో శకుంతలమీద కోపాన్ని తీర్చుకోవాలనుకొన్నాడు. సుగుణతో తన యింటిని పూర్తిగా మార్చివేయాలనుకొన్నాడు. తన భావాలని, అభిప్రాయాలని సుగుణకు చెప్పి తన యింట్లోకి స్వర్గాన్ని రప్పించుకోవాలనుకున్నాడు.

పెళ్ళయిపోయింది.

పెళ్లినాటివరకు జగన్నాథం ప్రసాదరావింటికి వెళ్లలేదు. పెళ్లికి శకుంతలవాళ్లూ వచ్చారు; సుగుణని చూసి శకుంతల అసూయపడాలనుకున్నాడు పెళ్లికొడుకు తాళికడుతూ. తలంబ్రాలు పోసేటప్పుడు అదోలా శకుంతలవేపు చూశాడు.

పెళ్లి అయిపోయాక శకుంతల వచ్చి— .

"నువ్వు అదృష్టవంతుడవు జగన్" అని ఆవిడ యిచ్చిన దీవెన తన విజయానికి చిహ్నమనుకున్నాడు మానవుడు!

4

సుగుణ కాపరానికి వచ్చింది.

పూర్తిగా పరిచయం కాని ఈ ఆగంతుకురాలి దగ్గర జగన్నాథానికి ఏ పని చెయ్యాలన్నా సిగ్గనిపించేది. తను భోంచేస్తున్నపుడు సుగుణ ఎదురుగా నిలబడితే యిహ నా ముద్దలు గొంతుక దిగేవి కావు; స్నానం చేయాలిసొచ్చినపుడు దగ్గర్లో సుగుణ వాసన తగలకూడదు.

సుగుణ పెద్దకుటుంబంలో పెరక్కపోయినా కొత్తవాళ్ళతో యెలా మాటాడి స్నేహాన్ని సంపాయించాలో, నలుగుర్లో ఏవిధంగా మసులుకోవాలో, ఏ పరిస్థితుల్లో ఎలా సర్దుకోవాలో అన్నీ తెలుసు. ఈ చురుకుదనం శకుంతలతో గాఢ స్నేహానికి పునాదులు వేసింది.

అయితే సుగుణ శకుంతలని అంతగా పడి పడి ఆరాధించడం జగన్నాథానికి నచ్చలేదు. అసలు వాళ్ళిద్దరికీ పరిచయం చెయ్యకూడదనుకొన్నాడు. కాని శకుంతలే ఓనాడు తన యింటికి రావడంతో తన పంతం నెగ్గిందికాదు. మళ్ళా సుగుణ ఆ ఇంటికి వెళ్ళడం—ఈ రాకపోకలతో వాళ్ళ స్నేహం మరింత వృద్ధిపొందింది.

సుగుణ కాపరానికి వచ్చినతర్వాత జగన్నాథం యింట్లో పైకి చాలా మార్పులు వచ్చాయి. ద్వారాలకి, కిటికీలకి తెరలు; మధ్యగది చిన్నదే అయినా ఓచిన్న టేబిలు, రెండు మూడు కుర్చీలు, ఫ్లవర్ వేస్, గోడలకి చిత్రాలు, యిలా వాతావరణం మారింది. ఈ మార్పు జగన్నాథాన్ని కొంత తృప్తి పరచింది. తమ్ముళ్ళు గూడా కాస్తంత యింటిపట్టునుండి వదిన చెప్పే చదువు శ్రద్ధగా చదువుకొంటూవున్నారు. భారతానికి అలవాటుపడ్డ తల్లి కోడలు చదివి వినిపించే కొత్త నవలలు శ్రద్ధగా వింటోంది. సుగుణ తీసు

కొచ్చిన విప్లవం యెంతటిదో జగన్నాథానికి అర్థమయింది.

ఓనాడు ఆఫీసునుంచి త్వరత్వరగా వచ్చిన జగన్నాథం :

“టౌన్ హాల్లో సాహిత్యసభ జరుగుతోంది. త్వరగా నువ్వూ బయలుదేరు” అన్నాడు.

కాఫీ కాస్తున్న సుగుణ కాసేపు వూరుకొని మెల్లగా అంది: తను రాలేనని.

“ఏం?” అన్నాడు జగన్నాథం విస్తుపోతూ.

సమాధానం సుగుణ చెప్పలేదు వెంటనే.

సాహిత్యసభలకి వచ్చేవాళ్లందరూ ముఖ్యంగా మగాళ్లేవుంటారు. వాళ్ళమధ్య కూచుని (ఆ సాహిత్య చర్చలు అర్థమవడం, అవకపోవడం ఆతర్వాత మాట) వినడమంటే చచ్చినంత పని. పుట్టింట్లో వున్నపుడు తను యిలాంటి సభలూ, చర్చలూ చూసి ఎరగదు; అన్నయ్యాలయినా చూపిస్తాం రమ్మనే మనుషులు కారు; కాలేజీలో చదివిన రెండేళ్లయినా ఒక్క ఏనవర్సిరీకే వెళ్ళగలిగింది: అదీ నలుగురు సహపాఠినులు బలవంతంచేస్తే. అలాంటి తను ఈనాడు ఒక్కసారిగా ప్రపంచం మధ్యలో కూచోమంటే, అది కంటకప్రాయంగానే తోస్తుంది మరి.

“శకుంతల వస్తోందా?”

ఈ ప్రశ్న జగన్నాథానికి మహా చిరాకుని కలిగించింది.

“ఏం, ఆవిడొస్తేనేగాని రాకూడదా?”

“అహఁ అదికాదు”—ఏదికాదో సుగుణ సమాధానం చెప్పుకోలేని సందిగ్ధంలో పడిపోయింది. కాని జగన్నాథం ముఖంలో స్పష్టంగా వ్యక్తమవుతున్న చిరాకుని, ఏవగింపుని గ్రహించి, గుండె బితుకు బితుకు మంటున్నా ‘సరే’ అనేసింది.

సభనించి యింటికి తిరిగివచ్చిన తర్వాత ఆలుమగల ముఖాల్లో రక్తపుచుక్క అనేది లేకుండా తెల్లగా పాలిపోయివున్నాయి.

సుగుణ తిన్నగావెళ్లి పక్కమీద వాలిపోయింది—తలనొప్పికి తట్టుకోలేక. అత్తగారు వచ్చి కాస్త ఎంగిలిపడమన్నా మాటాడిందికాదు. ఇటు కొడుకుగూడా ముఖం మాడ్చుకొని కూచున్నాడు. వాళ్లిద్దర్లో మరేం జరిగిందో ఆవిడకు అర్థంకాక లోపలికి వెళ్లిపోయింది.

రాత్రి బాగా చీకటిపడ్డాక జగన్నాథం పడకగదిలోకి వెళ్తే సుగుణ పక్కమీద కూచునివుంది. కళ్లు బాగా చెమ్మగిలివున్నాయి. భర్తనిచూసి చప్పున లేచి తలవంచుకొని మెల్లగా అడిగింది :

“మీకు కోపం వచ్చినట్టుంది”

సమాధానం లేదుకాని వికృతమైన నిట్టూర్పు వినిపించింది. క్షణం నిశ్శబ్దం తర్వాత—

“ఇంతో అంతో చదువుకున్నావ్, ఆమాత్రం యింగితం వుండఖర్లా? మగాళ్ల పక్కన కూచున్నంతలో వాళ్లు నిన్ను చంపుకతినేస్తారనేనా అంతలా ముఖం ముడుచుక కూచున్నావ్!” అన్నాడు.

సుగుణ మౌనంగా తలవంచుకొంది.

జగన్నాథం యింతగా కష్టపడ్డాడేగాని, నిజానికి అక్కడ జరిగిన సంఘటన అంత బాధాకరమైంది కానేకాదు. తనకి తెలిసిన ఇద్దరు ముగ్గురు స్నేహితులతో సుగుణని పరిచయం చేశాడు. కాని, ముందు సీట్లలో కూచున్న ఆఫీసర్లు, ప్రొఫెసర్లు, పెద్దమనుషులతో పరిచయం చేయలేకపోయానే అనే బాధ, మగాళ్లపక్కన కూచోడానికి సుగుణ తటపటాయించినపుడు కోపంగా మారి, ఉపన్యాసం జరుగుతున్నంతసేపూ విసుక్కునేట్టు చేసింది; సుగుణ చాల బాధపడ్డది; ఉపన్యాసకుని సాహిత్య విమర్శగూడా సరిగా వినలేకపోయింది. ఇక యింటికి వస్తూ దార్లో ఎంతగా చీదరించుకోవాలో అంతగానూ చీదరించుకోవడంతో సుగుణకు దుఃఖం ఆగిందికాది.

5

ఇలాంటి విచిత్ర సంఘటనలు జరుగుతూనేవున్నాయి వాళ్ళ జీవితంలో—జగన్నాథం విసుక్కుంటూనే వున్నాడు; కాని తన గుండెల్లో జ్వాలలు రేగే ఆ భావాల్ని విప్పిచెప్పడు ఎవరికీ.

శనివారంనాడు యెప్పుడూ ప్రొద్దుట తల్లి ఉపవాసం వుండటం పరిపాటి. ఆవాళ పూజాపునస్కారాలయిన తర్వాత శివకోవెల్లో హరికథా కాలక్షేపానికి ఆవిడ వెళ్ళిపోయింది. కోడలు యింట్లో వంటాగట్రా చేసిపెట్టింది. ప్రొద్దుట చన్నీళ్ళల్లో స్నానం చేయటంవల్ల కాబోలు సుగుణకు మధ్యాహ్నమయేసరికల్లా తలనొప్పిపట్టుకొంది. అది రానురాను భరించరానిదయింది. జగన్నాథం తమ్ముళ్లిద్దరు భోజనాలకు వచ్చారు. వదినకు సుస్తీగా వుందని తెలుసుకొని

వాళ్లే వసారాలోకివెళ్ళి యింత వడ్డించుకొని, తిన్నంత తిని ఎంగిలి గిన్నెలు అక్కడే విడిచిపెట్టి ఆటకి పోయారు.

రెండు గంటలకి జగన్నాథం యింటికి రావడంతో యిల్లు యెలా వుండాలో అలా వుంది. కడుపులో ఆకలి, ఆఫీసు చిరాకు, ఈదృశ్యానికి మరింత ఉడుక్కున్నాడు. ఎదురుగా తల విరజిమ్ముకొని నిద్రపోతున్న సుగుణని చూసి ఆ ఉడుకుమోత్తనం ఆవేశపడిపోయింది. ఊర్థ్వస్వరంతో యిల్లెగిరిపోయేటట్టు అరిచాడు :

"సుగుణా!"

సుగుణ ఉలిక్కిపడి కళ్లు విప్పింది. లేవడానికి ప్రయత్నించింది జగన్నాథం కనిపించగానే. కాని తలంతా దిమ్ముగా వుండటంవల్ల లేవలేక అతనివేపు ప్రశ్నార్థకంగా చూసింది.

"ఏమిటీ యిల్లంతా? ఎంగిలి గిన్నెలుమాసే తీరుబాటన్నా లేదా?"

అతని కోపానికి సుగుణ భయపడ్డది. లేవబోయింది కాని తలలో పోటు మరింత ఉధృతంకావడం వల్ల ఆ ప్రయత్నమే చెయ్యలేకపోయింది. మెల్లగా అంది :

"నేను చూడలేదు. వాళ్లే వడ్డించుకుని వెళ్ళి పోయినట్టున్నారు!"

తన నీరసపు మాటల్ని అర్థంచేసుకోగలడనుకొంది గాని, జగన్నాథం ఆ వ్యక్తిని పరీక్షగా చూసే స్థితిలో లేడు.

పిల్లలకింత ముద్దపడేసే తీరిక గూడా లేదన్నమాట!" అంటూ ఆవేశంతో ఒక్కవూపున చొక్కా విప్పేసరికి చమటకి తడిసివుందేమో బర్ మంది ; అగ్గిలో ఆజ్యం పడ్డట్టు—ఇక దాన్ని పూర్తిగా తీయకండానే చింపేసి విసిరేశాడు.

సుగుణ చాల బాధపడ్డది. ఓపికచేసుకు లేచింది. ఆ బాధలో తనకూ కోపం ఆగిందికాదు.

"అంత కోపం వస్తే నన్నే ఆ నాలుగూ అనేస్తే పోతుందిగా, నిష్కారణంగా ఆ చొక్కా చించుకొంటే వొచ్చే లాభమేమిటి?" అంది సగం స్వగతంగా.

గిర్రున తిరిగాడు జగన్నాథం. హద్దులుదాటిన ఆవేశం దౌర్జన్యానికి పూనుకోవలసిందే; కాని సుగుణ ముఖంలో ఏదో అజ్ఞాతశక్తి అతన్ని అంతపనీ చెయ్యనివ్వలేదు; అణగిపోయిన మాటలకి పెదవులు మాత్రం వణికాయి.

సుగుణ వసారాలోకి వెళ్లిపోయింది వడ్డించడానికి. వడ్డించి మధ్యగదిలోకి వచ్చి లేవమంది.

"అవసరం లేదు" అన్నాడు ముక్తసరిగా.

సుగుణ బ్రతిమాలే స్థితిలో లేదు. ప్రతీ విషయానికీ అత నింత వింతగా యెందుకు గెంతుతాడో అర్థం కాదు; ఏప్పుడో తనూ హద్దులుదాటి. మాటకి మాట అనెయ్యాలని అనుకునేది. కాని అలాంటి ధైర్యం కలిగే పరిస్థితులేం సుగుణకి కలగలేదు. అయితే ఈనాడు తనవంట్లో భరించరాని బాధమీద భర్త చూపించిన నిర్లక్ష్యం, అధికారం, ఆవేశం, ఆగ్రహం సుగుణ సున్నిత హృదయాన్ని ఉద్రేకంతో వూపి, కదిపి, కలత చెందించేసరికి ఆమెకు దుఃఖం, కోపం రెండూ ఆగాయి కావు.

"మీ కంత అవసరం లేనపుడు నేను బ్రతిమాలి, కాళ్లుపట్టుకొని కంట తడిపెట్టుకొనే పతివ్రతనీ కాదు, ఆదర్శగృహిణినీ కాను. మీ రంత నిర్లక్ష్యం చూపేముందు ఎదటి మనిషికిగూడా కాస్త చీమూ నెత్తురూ వుందని మరచిపోకండి."

అలుగుల్లా గుండెల్లో తగిలిన ఈ మాటలకి జగన్నాథం ఆశ్చర్యపడిపోతూ. తలెత్తి చూసేలోపల సుగుణ రెండుకళ్లూ అశ్రువులతో నిండిపోయాయి. మాటల వేగానికి తలనొప్పి మరింత తీవ్రమై, ఊగి నేలకు ఒరిగిపోయింది సుగుణ.

జగన్నాథం ఆమె కింద పడిపోయేవరకు తేరుకోలేకపోయాడు! క్షణం క్రితం మనస్సుని కలవరపెట్టిన కోపం, చిరాకు, అన్నీ శ్రావణ మేఘాల్లా చెదిరిపోయాయి. చప్పునలేచి సుగుణను లేవదీయబోయాడు.

"అవసరం లేదులెండి" అంటూ మెల్లగా లేచి పరుపుదగ్గరకు వెళ్ళిపోయింది.

సుగుణ అతనివేపు చూడలేదు; ఎవరితోనో మాటాడుతున్నట్టు అంది:

"మనుషుల్ని అర్థం చేసుకునేపాటి యింగితం నా భర్తకి లేకపోవడం నా అదృష్టంలాగుంది. ఎక్కడో ఎవరివల్లో పొందిన ఆవేశానికి భార్యని గురిచెయ్యడం గూడా నా అదృష్ట మేలాగుంది"

ఈ వ్యంగ్యానికి జగన్నాథం మరింత కూలిపోయాడు.

సుగుణ గిర్రున తిరిగింది. జగన్నాథం కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అడిగింది:

"చెప్పండి: మీ కిష్టంలేకపోతే మా పుట్టింటికి వెళ్ళిపోతాను."

జగన్నాథానికి ఆమెవంక చూసే ధైర్యం లేకపోయింది. గుండె తీవ్రంగా కొట్టుకో మొదలుపెట్టింది.

ఆ ఉద్వేగంలో యింకా ఏవేవో అనవలసిందే సుగుణ, కాని దుఃఖంతో గొంతుక పూడుకుపోవడంవల్ల ఏడుస్తూ లోపలికి వెళ్ళిపోయింది.

నోట మాటలేక జగన్నాథం అలానే కూలబడ్డాడు కుర్చీలో. సుగుణ తలనొప్పి తనకి పట్టుకున్నట్టుంది: కణతలు నొక్కుకుని కళ్ళు మూసుకున్నాడు.

తనేమన్నాడు? తన మాటల్లో సుగుణకు కోపాన్ని కలిగించే అర్థమేముంది? ఇల్లంతా గలీజుగా వుందని, ఆఫీసునించి యింటికి వచ్చేసరికి ఈ దృశ్యం తనకి కష్టాన్ని కలిగిస్తుందని అంటాడు గాని నిజానికి తనకు మాత్రం సుగుణని నొప్పించాలని వుందా?

రాత్రి చాలా పొద్దుపోయిన తరవాత పడకగదిలోకి వెళ్ళాడు. సుగుణ మెలుకువగా వుండడం చూసి ఆశ్చర్యపోయాడు; సిగ్గువేసింది గూడా; ఎదురు పడ లేకపోయాడు. చాలాసేపు నిశ్శబ్దం, మౌనం. ఆమె తనకు తానుగా పలకరించకపోవడం జగన్నాథానికి పరాభవంగా, పరాజయంగా తోచినా, పశ్చాత్తాప కంఠంతో తనే పలకరించాడు:

"సుగుణా"

"ఊఁ"

"నీ మనసు కష్టపెట్టినట్టున్నాను...?"

"........."

"—నిజానికి నిన్ను బాధించాలనే వుద్దేశం కాదునాది" తలెత్తి చూసింది.

"నాకు జీవితమంటె ఎన్నో సదభిప్రాయాలున్నాయి. గౌరవించడం నాకూ తెలుసు. కాని ఎందుకో మీ రెవరూ నన్ను లక్ష్యపెట్టరు—నాకు చాలా కష్టం వేస్తోంది, అలా తలచుకొంటె"

సుగుణ సమాధానం చెప్పలేదు.

ఇంట్లో ఆయన్ని ఎవరూ లక్ష్యపెట్టరు!!! ఏమిటీ వింతశంక!!! ఈయన లేనిపోని ఊహలతో బాధపడే మనిషా? గౌరవించడంలేదని లోలోపల బాధపడటం ఎందుకు? ఇంట్లో ఆయన్ని గౌరవించని వాళ్ళెవరు? కనీసం ఆయనమాటకి ఎదురైనా యెవరూ చెప్పరే! మరి ఈ వింత అనుమానం ఆయనలో కలగడానికి కారణం? ఆయన జీవితంలో ఏవో అందని పండ్లకోసం ఆశిస్తున్నారా? ఆ నిరాశ, నిస్పృహ కలిగించేబాధా, విచారం ఈ రూపంలో వ్యక్తమవుతున్నదా? ఆయన మనసులోవున్న భావాలకి, యింట్లోవాళ్ళు కలిగించే వ్యాఘాతంతో ఉద్రేకించి ఎదురుగా కనిపించే ప్రతీవాళ్ళమీదా చిరాకుపడటం: అతనికి బాహ్యప్రపంచంలో కలిగే యెదురుదెబ్బలేమో అని అనుమానించిన సుగుణ అభిప్రాయాన్ని శకుంతలగూడా ధృవపరచింది.

"నువ్వు కొన్నాళ్ళపాటు పుట్టింటికి వెళ్ళిపోరాదు సుగుణా?" అంది శకు.

"ఎందుకు?" అంది సుగుణ.

"మీ అత్తగారివంట్లో యిప్పుడేలానూ బాగులేదు. పురుడు అనే సాకుతో నువ్వు త్వరగా వెళ్ళిపోతే యింట్లో పరిస్థితులన్నీ జగన్‌కి కళ్ళకి కట్టినట్టు కనిపించి నిజం తెలిసొస్తుంది"

సుగుణ కీమాటలు అర్థం కాలేదు. అయితే మొన్న అత్తగారు వియ్యంకునికి 'అమ్మాయి నీళ్ళు పోసుకుంది పైనెలలో వచ్చి తీసుక వెళ్ళండి' అని రాసిన మాటలు జ్ఞాపకానికి వచ్చాయి అదేవంకతో త్వరగావెళ్ళి అక్కడ నాలుగునెలలువుండడం సుగుణకి కష్టమనిపించినా, శకుంతల:

"—నీముఖం యిలాంటప్పుడే కాస్త చాటవుతే నువ్వులేనిలోటు, దానివల్ల కలిగే వెలితీ అతనికి తెలిసొస్తుంది." అన్నమాటలకి సరే అని తల వూపింది.

ఆమర్నాడే సుగుణ పుట్టింటికి వెళ్ళిపోయింది.

6

ప్రియమైన సుగుణకు—

నమస్కారాలనాలో, ఆశీస్సులివ్వాలో తెలీక, ఏదీ అనకండా 'ప్రియమైన సుగుణకి ముద్దులు' అనేస్తా; సమ్మతమేనా? ఏం నేను యిలా ముద్దులాడితే మీ ఆయన ఈర్ష్యతో ముఖం ముడుచుకుంటాడా?

సరే ఓ విషయం:

జగన్నాథం అదోలా అగుపిస్తున్నాడీమధ్య. ముఖంలో కళేం కనిపించటం లేదు. మా యింటి

గూడా రావటంలేదు. రెండు మూడుసార్లు ఆహ్వానించాను. రాలేదు: ఏమిటో గమ్మత్తుగా ఉన్నాడు. నువ్వో 'కాయ'ని మోసుకొచ్చేనాటికి అయ్యగారు బాగా దారికి వచ్చేటట్టు కనిపిస్తున్నారు గాని, అతని వెర్రితత్వాన్నీ, నిలకడలేని మనస్సునూ తలచుకొంటే కథ అడ్డం తిరుగుతుందేమోనని అనిపిస్తోంది. అయినా నువ్వేం కంగారుపడ నవసరంలేదు. మగాళ్ళకి అంత ధైర్యం లేదులే ప్రపంచాన్ని ఎదిరించడానికి.

మరో ముఖ్య విషయం :

ఏమిటో వూహించు?

నువ్వూహించలేవులే. నేనే చెప్పేస్తా:

నేను పెళ్లాడబోతున్నాను—అంటే నాకు పెళ్ళి చేస్తున్నారు: నాకు నచ్చిన సంబంధమేలే. ఈ దిక్కుమాలిన సమాజంలో ఆడదాని చదువే ఓ సమస్య. ఇక ఆనర్స్ చదివిన నాలాంటి వాళ్ళకి—అందులో నడిమి తరగతివాళ్లకి—ఆశ లెక్కువ, ఆచరణ పూజ్యం. ప్రతీ ఆనర్స్ ఆడదానికీ ఓ ఐ ఏ ఎస్ కావాలంటే ఎలా? అందువల్ల నేను త్యాగం చేశాను. (మనలో మన మాట: ఇది త్యాగం కాదులే.)

వరుడు ఇంటర్ మూడేళ్లు తన్నేశాడు. మా యింటిపక్క సీతారామయ్యగారు లేరూ, వారి కుమారుడే. కావలసినంత ఆస్తి వుంది. ఆస్తికి నేను ఆశపడలేదనుకో—ఏమిటో సుదర్శన్ అంటే నాకు చిన్నప్పటినించీ అదో యిది; చాల మంచివాడు; చాల సౌమ్యుడు కూడా—ఇలా వర్ణించుకుంటూ పోలేను కాని—ఒకటి, ఈ పెళ్ళి ఎవరికీ యిష్టం లేదు. అయితేమటుకు పెళ్ళాడేది నేనుగా: అందుకని నాన్నా, అన్నయ్యా సరే అన్నారు.

ఈ నెలాఖరునే శుభముహూర్తం. నువ్వు రాలేవు: నా కేమిటో అదోలా వుంది. నీతో స్నేహమయి కొద్దికాలమే అయినా నా కేమిటో నీలో ఓ ప్రాణ స్నేహితురాలు కనిపించింది. నా తోటివిద్యార్థినులు అందరూ వస్తారు. కాని నువ్వు లేనిది నా కంతా వెలితే. అయితే ఒక మాట—నువ్వు మాత్రం నా వివాహానికి రావద్దు. వస్తే జగన్నాథానికి కనిపించాలి. మళ్ళీ రసాభాస అవుతుంది. నీకీ వివాహం చూడాలని వుంటే నువ్వొచ్చాక మళ్లో సరదాగా తలంబ్రాలు పోసుకుంటాంలే. జవాబు రాస్తావుకదూ?

—శకు.

ఉత్తరం పోస్టులో వేశాక తిన్నగా శకుంతల జగన్నాథం యింటికి వచ్చింది.

జగన్నాథం ఆఫీసుకి వెళ్ళాడు. సీతమ్మకి వంట్లో బాగా నీరసంగా వుంది. ఓపికగా వసారాలో కూచుని వంట చేస్తోంది. తలుపులన్నీ తీసే వున్నై. ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి వున్నై. జగన్నాథానికి కోపాన్ని తెప్పించే ఎంగిలి గిన్నెలు ఈవాళగూడా అలానే వున్నై. శకుంతల తిన్నగా వసారాలోకి వెళ్లింది.

సీతమ్మ చప్పున లేచి ముక్కాలిపీట వేసింది, శకుంతలను కూచోమని బలవంతం చేస్తూ.

"మీ వంట్లో యిప్పుడెలా వుందండి?" అనడిగింది శకుంతల కూచున్న తర్వాత.

"ఏం వుండడం తల్లీ: ముసలితనం కదా. అయితే మాత్రం ఇంటిపనులు చేయక తప్పుతుందా?"

శకుంతలకు తర్వాత ఏం అడగాలో చప్పున స్ఫురించలేదు. సుగుణ మాట ఎత్తితే అది ఎలాంటి ప్రసంగంలోకి దిగుతుందో తెలీదు. దాన్ని సర్ది చెప్పడమూ, లేక వ్యతిరేకంగా మాటాడటమూ అని అనుకునే సరికల్లా భయం వేసింది.

"జగన్నాథం ఆఫీసునించి యెప్పుడొస్తాడు?" అంది, ప్రసంగాన్ని మరో త్రోవకి తీసుకరావాలని.

"ఎప్పుడో వస్తాడు...వస్తే ఇంట్లో ప్రాణాలన్నీ బిగబట్టుకొని ఏమూలో నక్కి కూర్చోవలసిందేగా."

"ఏం?"

"ఏం చెప్పాలి? మా వంశంలో యిలాంటి మనిషి ఒక్కడూ లేడు: మాటకి కోపం, చీటికి కోపం. ఉత్తిపుణ్యానికి చిర్రుబుర్రుమంటాడు. ఆ గిన్నెలు తియ్యలేదేం, ఆ బట్టలు అక్కడున్నాయేం, మీరేం చేస్తున్నారు—అబ్బబ్బ! ఒక్కటా—వచ్చిందగ్గర్నుంచి ఒకటే సణుగుడు" అని కాసేపాగి మళ్ళీ అంది:

"కోడలు వెళ్లింది—మరీ వీడి ఆగడం ఎక్కువయింది. ఆ అమ్మాయి వున్నపుడు మాత్రం ఒక్కనాడు స్థిమితంగా వున్నాడా? అదీలేదు. అలాంటి గంగిగోవును గూడా సాధించడం, కొట్టడం—"

"కొట్టాడా సుగుణని?"

"ఆఁ—అంతకంటె చేతొచ్చింది మరోటుంటేగా? ఆడపిల్ల ఉసురు తగిల్తే—"

"నాకు సుగుణ యిలాంటివేం చెప్పలేదే ఎప్పుడు?"

"ఏమని చెబుతుంది? వాడిలాంటి పసువైతే చెబుతుంది. అయినా అంత మెత్తని మనసుగల పిల్లలు ఏ నూటికో కోటికో గాని కనిపించరు. వీడికే జన్మలోనో చేసుకొన్న పుణ్యాన అలాంటిది దొరికితే దాన్నిలా వేధించుక తింటున్నాడు.

"ఒక టాలోచించమ్మా: వీడిచేత తన్నులు తినడానికి, వీడి నోటిమాటలు పడటానికే వాళ్లు పిల్లనిచ్చుకున్నారా? రేపొద్దుట వాళ్లకీ విషయం తెలిస్తే వాళ్లమనస్సు లెంత బాధపడతాయో ఆలోచించమ్మా."

"సుగుణ అలాంటిమాటలేం చెప్పదులెండి"

"నాకూ అదే ధైర్యం. ఎంత దుఃఖాన్నయినా కడుపులో దాచుకొంటుంది" అంది సీతమ్మ. తర్వాత చాలసేపటివరకు వారిద్దరిమధ్యా మాటలు లేవు. తర్వాత సీతమ్మే అడిగింది:

"అమ్మ వాళ్ళు బాగున్నారా అమ్మ"

"బాగున్నారండి"

"ఏవిఁటో—ఎప్పటికప్పుడే మీయింటికి రావాలనుకొంటాను, కాని—చూస్తున్నావుకదమ్మ ఇంట్లో వీడి పిల్లి గెంతులు—"

"అవి క్రమేపీ తగ్గిపోతాయిలెండి"

"ఏం తగ్గుతాయో నా ముఖం"

శకుంతల సంచిలోనుంచి కవరు తీసింది. తన చేత్తో జగన్నాథం పేరురాసిన కవరునిచూసి చిరునవ్వు నవ్వుకొంది. మాటాడకుండా దాన్ని సీతమ్మకందించింది.

"ఏవిఁటమ్మా?"

"శుభ లేఖ"

"ఎవరిది?"

శకుంతల సన్నగా నవ్వింది.

"అరిదొంగా! ఇందుకా వచ్చి—యింతవరకు మాటాడలేదు" అంటూ సీతమ్మ అప్పుడే దీవనలు ఆశీర్వాదాలు యివ్వడం మొదలుపెట్టింది. "అయితే పెళ్లికొడు కెవరు?"

శకుంతల చెప్పింది.

వెళ్లిపోయేముందు జగన్నాథాన్ని మరీమరీ రమ్మనమని చెప్పి వెళ్ళిపోయింది.

సాయంకాలం ఆఫీసునించి తిరిగొచ్చాక జగన్నాథం ఈ శుభలేఖని చదువుకొని ఓ నిట్టూర్పు విడిచాడు. అయితే అతను ఒకందుకు ఆశ్చర్యపడ్డాడు: సుదర్శనరావు ఈ వివాహానికి ఒప్పుకున్నా సీతారామయ్యగారు యెలా ఒప్పుకున్నారని.

మూడుదినాలైనతర్వాత సీతమ్మ మంచంమీదినించి కాలు కింద పెట్టలేనిస్థితికి వచ్చింది. వంటకి ఇబ్బందయింది. జగన్నాథానికి ఏమీ తోచక 'వీలైనంత త్వరలోవచ్చి, తల్లి జబ్బు నయమయాక మళ్లీ వెళ్ల'మని సుగుణకి ఉత్తరం రాశాడు. కాని అక్కడనించి యెలాంటి సమాధానం రాకపోవడంతో నిప్పుతొక్కిన కోతిలా గెంతాడు. తొమ్మిదిన్నరకి ఆఫీసుకి వెళ్లేలోపునే వంట తయారుచేయాలి యింటందరికీ. తనకి సహాయం చేసేవారు లేకపోవడంతో పెద్ద తమ్ముణ్ణి తోడు వుండమన్నాడు.

"మరి బడో?" అన్నాడు వాడు.

"ఏడిశావ్—మానేసెయ్ వెధవబడి"

ఏ బడిని పరమపవిత్రంగా ఎంచుకోమని తమ్ముళ్ళకు బోధిస్తూ వచ్చేవాడో, ఆ బడికి వాణ్ణి వెళ్లొద్దని ఆజ్ఞాపించడంలో తను చేస్తున్న తప్పిదం ఎంతటిదో ఆ క్షణంలో జగన్నాథానికి తెలిసిరాలేదు.

సాయంకాలం ఆఫీసునించి యింటికి రావడంతో కాఫీ తయారుగా వుండేదికాదు; స్నానానికి వేణ్ణీళ్లు వుండేవికావు; అందుకుతోడు యిద్దరు వెధవలూ తిన్న ఎంగిలి గిన్నెలు అలానే వెక్కిరిస్తూ నట్టింట్లో వుండేవి. ఒకనాడు ఇద్దర్నీ చితకబాదాడు. వాళ్ళకీ తిట్లు, తన్నులు అలవాటైపోవడంవల్లలాగుంది, వీటిని అంతగా ఖాతరుచేసేవారు కారు.

7

రెండు నెలల తర్వాత ఒకనాడు సుగుణ తలకి స్నానంచేసి డాబామీద కూచుని దువ్వుకొంటూ వుంటే తమ్ముడు అల్లరిచేసుకొంటూ అక్కడికి వచ్చాడు.

"అబ్బ! ఏవిఁట్రా ఆ గావుకేకలు కాస్త నెమ్మదిగా రాలేవ్?" అంది చిరాకుగా.

"అయితే సరె, వెళ్లిపోతా" అంటూ వాడు వెనక్కి తిరిగేసరికి, సుగుణకు అనుమానంవేసి వాణ్ణి చప్పున పట్టుకొంది.

"ఏమన్నా ఉత్తరం వచ్చిందేవిఁట్రా?"

"నన్ను పొమ్మన్నావ్ గా"

"నిన్ను కాదు తమ్ముడూ—ఎవరు రాశారేవిఁటి?"

మెత్తపడి ఉత్తరం యిచ్చేశాడు. అడ్రసు చూసి శకుంతల దస్తూరీని పోల్చుకొంది.

సుగుణా!—

ముద్దులు.

పెళ్ళికి మీ ఆయన రాలేదు. మా అన్నయ్య గూడా మరీ మరీ చెప్పాడు. కారణం తెలీదు. మా ఆయనకీ జగన్‌కీ ప్రాణస్నేహం. పోనీ అది చూసైనా రాలేదు.

కాని మొన్న ఏమయిందంటె: మా యిద్దరం పిక్చరుకి వెడుతుంటే దార్లో కనిపించాడు. మాతో బాటు పిక్చరుకి రమ్మని బలవంతం చేశాం. చాలాసేపు నసికి చివరికి వచ్చాడు. హాల్లో ఒక్క మాటైనా మాట్లాడాడు కాదు. పోనీ సుదర్శన్‌తోనైనా మాటాడలేదు.

మళ్ళా క్రితం శనివారం మా యింటికి వచ్చాడు—సుదర్శన్ బలవంతంమీద. ఏవిఁటో వింత ప్రకృతి! అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తున్నాను...ఇప్పుడు రోజూ మా యింటికి వస్తున్నాడు.

—శకు.

ఉత్తరం పూర్తయాక సుగుణ మనస్సు చెప్పరాని బాధతో బరువెక్కిపోయింది. గుండె దడ హెచ్చింది. వళ్ళంతా చమట పట్టేసింది. ఛీ ఛీ! ఏవిఁటీ వింత శంకలు! తనని తానే నిందించుకొంది.

పది దినాల క్రితం శకుంతల రాసిన ఉత్తరం జ్ఞాపకానికి వచ్చింది: ఇంత త్వరలో తనని తిరిగి రావద్దని, కనీసం జగన్నాథానికి ఉత్తరమైనా రాయొద్దని. వీటన్నిటినీ లంకె వేసి చూస్తే సుగుణకంతా అయోమయంగా కనిపించింది...వెంటనే తనని తాను నిందించుకొని మామూలుగా శకుంతలకి జవాబు రాసింది.

ఉత్తరం అందిన సమయానికి జగన్నాథం శకుంతల యింట్లో వున్నాడు. శకుంతల నవ్వుతూ ఆ ఉత్తరాన్ని అందించింది. జగన్నాథం చదువుకొని చిరునవ్వు నవ్వి వూరుకొన్నాడు.

“మరో పక్షం దినాల్లో పితృత్వం సంపాయించేస్తావ్!” అందిశకుంతల నవ్వుతూ.

జగన్నాథం శృతి కలిపాడు.

టీ తీసుకవస్తానని ఆమె లోపలికి వెళ్ళిపోవడంతో జన్నాథం ఆలోచనలో పడ్డాడు. శకుంతలలో చాలా మార్పు కనిపిస్తోంది—పెళ్లయిన దగ్గర నించి. ఇంతకుముందు యిలా గంటలతరబడి మాటాడేదికాదు; ఒంటరిగా తనతో కూచోడానికి భయపడేది; తనేమన్నా తప్పించుకు తిరిగేది—కాని యిప్పుడు—!

జగన్నాథం వూహించ మొదలుపెట్టాడు: శకుకి సుదర్శన్ వల్ల సంతోషం లేదా? సుదర్శన్‌ని అసహ్యించుకొంటోందా? చప్పున ఏ సమాధానం చెప్పుకోలేకపోయాడు.

తను శకుంతలతో యింత చనువుగా తిరుగుతున్నా సుదర్శన్ ఏం అనుకోడేం? ఏమో మనస్సులో అనుమానిస్తున్నాడేమో!

మొదట్లో వీళ్ల అనుకూల దాంపత్యానికి జగన్నాథం యెంతో ముచ్చటపడ్డాడు. సాయంకాలం నలుగురూ వాళ్లింట్లో చేరి ఏదో గోష్ఠి చేస్తూవుంటే అందరిమధ్యా శకుంతలని, సుదర్శన్‌ని చూసి తనకు సుగుణ జ్ఞాపకం వచ్చేది. తను అలా కాలేడా? ఆ కుతూహలంతోనే రోజూ సుదర్శనం యింటికి వెళ్లేవాడు.

శకుంతల టీ తీసుకవచ్చి ఓ కప్పు జగన్నాథానికి అందించింది.

కప్పు అందుకొంటూ “సుదర్శన్ వచ్చేవరకు ఆగకూడదు?” అన్నాడు.

“ఆయ నెప్పుడో వస్తారు—ముందు నువ్వు తీసుకోండూ.”

తాగుతున్నాడే కాని జగన్నాథానికి ఏదోగా వుంది.

“సుగుణని ఎప్పుడు తీసుకొస్తావ్?”

“ఇంకా పురుడన్నా కాలేదు—”

“తర్వాతేనయ్యా?”

“మూడో నెలలోలాగుంది—అంటారు.”

శకుంతలకు వెనకటివన్నీ జ్ఞాపకానికి వచ్చి చిరునవ్వునవ్వింది:

“సుగుణ అంత త్వరగా యెందుకు వెళ్లిపోయిందో తెలుసా?”

“నువ్వేదో మంత్రం వేసుంటావ్” అన్నాడు నవ్వుతూ.

“సుగుణ రాసిందా?”

“సుగుణా? అప్పటినించి ఓ ఉత్తరమైనా రాయలేదు”

“నిజం?”

"నిజమే. ఆవిడకు ఉత్తరం రాసేంత తీరుబాటు గూడానా?"

శకుంతల విస్తుపోయింది. తను జగన్నాథానికి ఒక్క ఉత్తరమన్నా వ్రాయలేదని సుగుణరాస్తే నిజం అయివుండదులే అనుకొంది. అయితే సుగుణ నిజంగా తనమాటమీద నిలబడిందన్నమాట. ఫర్వా లేదు. జగన్నాథంలో మార్పొచ్చినట్టు కనిపిస్తోంది. ఇక వాళ్ళ జీవితం సాఫీగా నడిచే సూచనలు కనిపిస్తున్నాయ్.

"శకుంతలా!"

ఉలిక్కిపడి చూసింది.

జగన్నాథం మాటాడలేదు. ఆమె కళ్లల్లోకి చూస్తూ వుండిపోయాడు. ఆ చూపు అర్థం కాలేదు శకుంతలకి.

"ఏవిఁటి?"

"శకు...!"

"ఆ కంఠం విని శకుంతల భయపడింది. జగన్నాథం నిలబడి చప్పున చెయ్యిపట్టుకున్నాడు.

"ఏవిఁటిది జగన్నాథం!"

సమాధానం చెప్పలేదు. చేతులు రెండూ పట్టుకొని తృష్ణతో చూడటం మొదలుపెట్టాడు. శకుంతల చివాల్న చేతులు విడిపించుకొని దూరంగా వెళ్ళిపోయింది!

"నువ్విలాంటివాడివని అనుకోలేదు జగన్. యిక్కణ్ణించి వెళ్ళిపో...యిహ యిక్కడికి రాకు" అని గిర్రున తిరిగిపోయింది.

ఇంటికి యెలా వచ్చాడో తెలీదు; వచ్చీ రాగానే పక్కమీద వాలిపోయాడు!

ఈ నెలదినాలుగా శకుంతల సమక్షంలో, ఆయింట్లో ఆ వాతావరణంలో స్వర్గం కనిపించింది; అది ఒక్కసారిగా పేకమేడలా కూలిపోయింది... తను శకుంతలని అపార్థం చేసుకున్నాడా? కాక శకుంతలే తన సౌశీల్యాన్ని చాటించుకోడానికి యిలా అన్నదా?

తర్వాత రెండు రోజులవరకు ఆఫీసుకి వెళ్ళలేదు. ఆ నలభై యెనిమిది గంటలూ శకుంతలగురించే ఆలోచిస్తూ వున్నాడు. ఈ ఆలోచనలకి యింట్లో వాళ్ళు అంతరాయం కలిగించినపుడల్లా కస్సుమని లేచేవాడు. ఈ కోపమంతా సుగుణకి ఉత్తరం రాసి తీర్చుకోబోయాడు. కాని అది పోస్టు చెయ్యడానికి మనస్కరించలేదు.

వారం దినాల తర్వాత మామగారు ఉత్తరం రాశారు: మగపిల్లాడని. జగన్నాథం లోలోపల ఎంత సంతోషించినా ఆ విషయాన్ని సుగుణ రాయకూడదా అనుకొన్నాక వళ్లుమండుకొచ్చింది. ఆడదానికి యింత పంతమా? శకుంతల మాటమీద ఉత్తరం రాయడం మానేసిన ఆడది తనకి భార్య! వీలయినంత త్వరలో తిరిగిరమ్మనమని రాద్దామనుకొన్నాడు. కాని ఆవిడ పంతమేమిఁటో చూద్దామని వూరుకున్నాడు.

మామగారు ఉత్తరాలు రాస్తూనే వున్నారు— కాని యిక్కణ్ణించి జవాబులు లేవు సుగుణ గూడా ఏం మాటాడదు. ఆ కోపం భరించరానిదయేకొద్దీ జగన్నాథం పిచ్చెత్తిపోతున్నాడు. ఒకనాడు ఏదోచిన్న తప్పుచేస్తే తమ్ముళ్లు యిద్దర్నీ చితకబాదాడు. వాళ్లకి అన్నయ్య కోపం ఒకంతట తెలిసిరాక ఏడుపు లంకించుకొన్నారు; మరో నాలుగు పడేసరికి తల్లి లోపలనించి—

"ఎందుకురా, పెద్దబ్బాయ్, వాళ్ళ నలా చావగొడుతున్నావ్?" అంది నీరసంగా.

జగన్నాథం ఈ మాటలతో మరింత పైకి లేచాడు.

"సరేలే నువ్వు నోరు మూసుకో"

సీతమ్మ బాధతో నిట్టూర్పు విడిచి మూలిగింది.

జగన్నాథం బయటకు వెళ్ళిపోయాడు.

అంతా అయోమయంగా వుంది. సుగుణ...... ఏమనుకుంది తనమటుకి? ఇంత నిర్లక్ష్యమా? ఇంత అహంభావమా? కడుపులో గోలపెడుతున్న ఎలకలు అతన్ని మరింత పిచ్చెత్తించాయి.

ఇంటికి చప్పున తిరిగొచ్చి నాలుగే నాలుగు ముక్కలు "నీకు భర్త కావాలనే వుద్దేశం వుంటే, ఇదే టెలిగ్రాం అనుకొని రా—లేకపోతే యిహను వ్విక్కడికి వచ్చే అవసరంలేదు" అని రాసి పోస్టులో వేశాడు.

గుండెలమీదినించి కొన్ని టన్నుల బరువు దిగిపోయినట్టు నిట్టూర్పు విడిచాడు.

మర్నాడు వస్తుం దనుకొన్న సుగుణ రాలేదు. జగన్నాథానికి క్షణక్షణానికి కోపం హెచ్చిపోతోంది. అయినా వంట చేయక తప్పింది కాదు; వంట చేశాడు; తల్లికి మందు తెచ్చాడు; ఆఫీసుకి వెళ్ళాడు; సాయంకాలం యింటికి వచ్చాడు; మళ్లా వంట; మందు; ఆఫీసు; నిద్ర—

సుగుణ రాలేదు.

ఆఫీసుకి బయలుదేరే సమయానికి శకుంతల యెదురుపడింది.

జగన్నాథం ఆశ్చర్యపడే ఆస్కారాన్నయినా కలగనివ్వకండా అడిగింది:

"ఆఫీసుకా?"

తల వూపాడు.

"ఒకసారి లోపలికి రా, మాటాడాలి నీతో"

అప్రయత్నంగా శకుంతల వెనకాల వెళ్లాడు. లోపలికి వెళ్లాక ఆమె గదినంతనీ పట్టిపట్టి చూడటం జగన్నాథానికి నచ్చలేదు.

"రావడానికి కారణం త్వరగా చెప్పేస్తే—"

అర్థోక్తిలో అందుకొని శకుంతల అంది "మీరు వెళ్లిపోతారు!"

"నాకు టైం లేదు—"

"సరె...సుగుణ నాకు ఉత్తరం రాసింది"

జగన్నాథం ముఖం పాలిపోయినా, ఆశ్చర్యాన్ని అణచుకో ప్రయత్నించాడు.

"ఈవాళ చాల పనిపెట్టుకొనే యిక్కడికి వచ్చాను...మీరు రాస్తున్న వుత్తరాలన్నీ సుగుణకి అందుతున్నాయి. కాని వాటికి జవాబు యివ్వొద్దని నేనే అభ్యంతర పెట్టాను."

"ఎందుకో!"

ఆ 'ఎందుకో' కి శకుంతల సమాధానం చెప్పలేదు.

"సుగుణ యిప్పుడు టైఫాయిడ్‌తో మంచం పట్టింది. నేను చూడ్డానికి వెడుతున్నా"

సుగుణ జ్వరానికి ఆశ్చర్యపోని జగన్నాథానికి 'నేను వెడుతున్నాను' అన్న ఆవిడమాటలు అలుగుల్లా తగిలేసరికి పౌరుషం పుట్టుకొచ్చింది.

"వీల్లేదు"

"ఏం?"

"వీల్లేదు"

"అదే ఎందుకు?...నీకు భర్తగా ఆవిడమీద హక్కువుంటే వుండొచ్చు కాని నన్ను వెళ్లొద్దని ఆజ్ఞాపించడంలో అర్థంలేదు"

జగన్నాథం మరో మాట ఆడేలోపునే శకుంతల అడిగింది:

"ఆదర్శానికీ, ఆచరణకీ మధ్య మనిషి కుండే ఓర్మి ఓపికకు గల విలువ యెంతటిదో నీకు తెలుసా?"

"ఆ ప్రశ్న నన్నెందు కడగవలసి వచ్చిందో?"

"ప్రస్తుతం నీ పరిస్థితికి ఆ ఓర్మి, ఓపిక లోపించటమే మూలం కావటంవల్ల, నిజానికి నీ భావాలు వున్నతమైనవే కావచ్చు, అయితే ఆచరణ విసుక్కోవడంవల్ల సులభసాధ్యమవుతుందా? పోనీ, ఇంట్లో వాళ్లకి నీ భావాలు యివీ అని నచ్చచెప్పడానికి ప్రయత్నించావా? అసలు నీకు సంస్కృతి అంటే ఏం అర్థమయింది?"

జగన్నాథం సమాధానం చెప్పలేదు.

"డబ్బున్నవాళ్లని చూస్తారు. వాళ్ల కుటుంబాలని, యిళ్లని చూస్తారు; అవన్నీ చూసి అదే ఉత్తమ సంస్కృతి అనే భ్రమలో పడిపోతున్నారు.

"అలా ఆశించడంలో తప్పులేదు; అయితే నీదృష్టిలో యింత భేదం యెందుకు కలగాలి? ఈయిళ్లని, మనుష్యుల్ని చూశాక, మీయింటిమీదా, మీవాళ్లమీదా ఎందుకంత చిన్నచూపు, కోపం, ఏహ్యం కలగాలి? ఆ మనస్తత్వంతో వాళ్లని నానా మాటలని, వాళ్లు బాధపడేకొద్దీ రెచ్చిపోవడంలో నువ్వెంత తప్పుచేస్తున్నావో ఓనాడైనా ఆలోచించావా?"

జగన్నాథం తడబడ్డాడు.

"సాహిత్యసభలకి సుగుణని. తీసుకవెళ్లడం తప్పనను. అయితే ఆమె మగాళ్లపక్కన కూచోడానికి సంకోచించినంతలో నువ్వామెమీద విరుచుకపడటం నీకున్న 'సంస్కృతి'కి మచ్చకాదా?" అని క్షణమాగి శకుంతల అంది:

"పాపం! సుగుణ యివేం యెవరితో చెప్పుకునేది కాదు. ఒకరోజున మరీ ఆగలేక నాతో చెప్పుకుంది. నే నిచ్చిన సలహా: పుట్టింటికి వెళ్లమని. ఆమె కొంతకాలం కనుచాటయితే నీ స్వరూపం నీకు తెలిసొస్తుందేమో అని భ్రమించాను కాని నువ్వు విడాకులవరకు వెళ్లిపోవడం నీ విద్యకే అపచారం కాదూ? ఆలోచించు."

శకుంతలఆగిపోయేసరికి జగన్నాథం తలెత్తాడు.

"నాకింకా ప్రపంచమంటే ఏమిటో తెలిసిరాలేదు శకుంతలా" అన్నాడు పశ్చాత్తాపపడుతున్నట్టు.

"తెలిసిరాలేదనకు; తెలిసికోడానికి ప్రయత్నించలేదను. ఆవాళ నన్ను బలవంతం చేయడం నీకు నేను అర్థం కాకపోవడంవల్లే. అలానే సుగుణ గూడా." అని ఓ నిట్టూర్పు విడిచి—

"సరే నాకు టైమవుతోంది—ఈబండికే వెళ్లకపోతే సుగుణని చూడలేనేమో" అంది.

జగన్నాథం నిలువెల్లా కంపించిపోయాడు ఈ చివరి మాటలకి. తనూ లేచిపోయి—

"నేనూ వస్తున్నా" అన్నాడు.